# తెలంగాణ వెన్నెల వాక్కు

జాతీయ దినపత్రిక

TELANGANAVENNELA WAKKU

TGTEL/25/A0871



తెలంగాణ వెన్నెల వాక్కు జాతీయ దినపత్రిక TELANGANAVENNELA WAKKU

విలేకరులు కావలెను

ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ శరవేగంగా రాజకీయ పరిస్థితులపై వాస్తవ కథనాలు అందిస్తూ అనతి కాలంలోనే ప్రజాదరణ పొందిన తెలంగాణ వెన్నెల వాక్కు లో రాష్ట్ర వ్యాప్తంగా స్టాఫర్లు, ఆర్సీ ఇంచార్జీలు, మండల రిపోర్టర్లు కావలెను. అనుభవజ్ఞులకు ప్రాధాన్యం.. కొత్త వారికి ప్రోత్సాహం

మీరు పని చేయాలనుకుంటున్న కేంద్రాల్లో ఖాళీల వివరాల కోసం 7386173123 నంబర్‌ను సంప్రదించండి..

డి. యోగేష్ కుమార్, సీఈవో



హైదరాబాద్ | సంపుటి : 02 | సంచిక :05 | 19-07- 2026 | ఆదివారం | వెల:03/- | పేజీలు: 4


## దిల్లీ జంతర్ మంతర్ వద్ద తీవ్ర ఉద్రిక్తత..

### ఆసుపత్రికి సోనమ్ వాంగ్‌చుక్ తరలింపు!

దిల్లీ:

దేశ రాజధాని దిల్లీలోని జంతర్ మంతర్ నిరసన వేదిక వద్ద ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. లడఖ్ ప్రాంతానికి రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్ కింద ప్రత్యేక ప్రతిపత్తి కల్పించడంతో పాటు, హిమాలయ పర్యావరణ పరిరక్షణ కోసం, స్థానిక గిరిజన ప్రజల భూమి, ఉద్యోగ హక్కుల కోసం గత కొన్ని రోజులుగా శాంతియుత మార్గంలో ఆందోళన చేస్తున్న ప్రముఖ సామాజిక కార్యకర్త, పర్యావరణ ప్రేమికుడు సోనమ్ వాంగ్‌చుక్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. జంతర్ మంతర్ వేదికగా ఆయన చేపట్టిన నిరసన దీక్ష కారణంగా ఆరోగ్యం క్షీణించడంతో, పోలీసులు బలవంతంగా ఆయనను అక్కడ నుంచి ఆసుపత్రికి తరలించారు. ఈ పరిణామంతో అక్కడ ఉన్న లడఖ్ ప్రజలు, నిరసనకారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఉద్రిక్తత మరింత పెరిగింది.



లడఖ్ నుంచి దిల్లీ వరకు సుదీర్ఘ పాదయాత్ర చేపట్టిన సోనమ్ వాంగ్‌చుక్ బృందాన్ని గతంలోనే దిల్లీ సరిహద్దుల్లో పోలీసులు అడ్డుకున్న సంగతి తెలిసిందే. ఆ తర్వాత జంతర్ మంతర్ వద్ద నిరసనలు తెలియజేసేందుకు అనుమతించినప్పటికీ, వారి డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టమైన హామీ రాకపోవడంతో ఆయన నిరాహార దీక్షకు దిగారు. రోజుల తరబడి ఆహారం తీసుకోకపోవడంతో ఆయన శరీరంలో కీలక అవయవాల పనితీరు మందగించిందని, నీరసం పెరిగిందని వైద్య వర్గాలు హెచ్చరించాయి. సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం ఆందోళనకరంగా మారిందనే సమాచారంతో దిల్లీ పోలీసులు నిరసన ప్రదేశానికి చేరుకున్నారు.

ఆయనను ఆసుపత్రికి తరలించే క్రమంలో దిల్లీ పోలీసులు జంతర్ మంతర్ వద్ద భారీగా బలగాలను మోహరించారు. నిరసన ప్రదేశానికి వెళ్లే అన్ని ప్రధాన మార్గాలను అదుపులోకి తీసుకున్న పోలీసులు, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యగా పెద్ద ఎత్తున భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ క్రమంలో వాంగ్‌చుక్‌ను తరలించవద్దంటూ నిరసనకారులు పోలీసులను అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగి, తీవ్ర గొడవకు దారితీసింది. దీంతో జంతర్ మంతర్ ప్రాంతం రణరంగంగా మారింది. నిరసనకారులను చెల్లాచెదురు చేసేందుకు పోలీసులు ప్రయత్నించగా, వారు ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా పెద్ద పెట్టున నినాదాలు చేశారు.

ప్రస్తుతం సోనమ్ వాంగ్‌చుక్‌ను దిల్లీలోని ఒక ప్రముఖ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అత్యవసర వైద్య సేవలు అందిస్తున్నారు. ఆయనకు గ్లూకోజ్ అందించడంతో పాటు నిపుణులైన వైద్యుల బృందం ఆయన ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తోంది. మరోవైపు జంతర్ మంతర్ పరిసర ప్రాంతాల్లో పటిష్ట ఆంక్షలు విధించినట్లు తెలుస్తోంది. పోలీసులు భారీ బారికేడ్లను ఏర్పాటు చేసి ఇతరులు నిరసన స్థలానికి రాకుండా అడ్డుకుంటున్నారు. లడఖ్ హక్కుల సాధన కోసం దిల్లీ వేదికగా జరుగుతున్న ఈ పోరాటం, వాంగ్‌చుక్ ఆసుపత్రి పాలుకావడం మరియు పోలీసుల భారీ మోహరింపుతో ఇప్పుడు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం తక్షణమే స్పందించి లడఖ్ ప్రతినిధులతో చర్చలు జరపాలని పలువురు సామాజిక విశ్లేషకులు డిమాండ్ చేస్తున్నారు.

## విక్రమ్-1 ప్రయోగం విజయవంతం

### స్కైరూట్ ఏరోస్పేస్‌కు సీఎం రేవంత్ రెడ్డి హృదయపూర్వక అభినందనలు

హైదరాబాద్:లి

పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన ఆర్బిటల్-క్లాస్ ప్రయోగ వాహనం 'విక్రమ్-1'ను విజయవంతంగా పరీక్షించిన హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ స్పేస్ సంస్థ 'స్కైరూట్ ఏరోస్పేస్'కు తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.



'మిషన్ ఆగమన్'లో భాగంగా నిర్వహించిన విక్రమ్-1 టెస్ట్ ఫ్లైట్-1 విజయం భారత అంతరిక్ష రంగ చరిత్రలోనే ఒక చారిత్రాత్మక ఘట్టమని, ఇది తెలంగాణ రాష్ట్రానికి ఎంతో గర్వకారణమని ముఖ్యమంత్రి కొనియాడారు.

**భారత యువత ప్రతిభకు నిదర్శనం**

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు మాట్లాడుతూ.. అంతరిక్ష సాంకేతిక రంగంలో దేశం సాధిస్తున్న అపార పురోగతికి స్కైరూట్ సాధించిన ఈ విజయమే నిదర్శనమన్నారు. అంతరిక్ష అన్వేషణలో భారత యువ శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, మరియు ఆవిష్కర్తల అద్భుత ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పే ఘనత స్కైరూట్ సంస్థకు దక్కిందని ఆయన ప్రశంసించారు.

**శంషాబాద్ క్యాంపస్ జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ..**

ఈ ఏడాది ఏప్రిల్‌లో శంషాబాద్‌లోని జీఎంఆర్ ఏరోస్పేస్ పార్క్‌లో ఉన్న స్కైరూట్ మ్యాక్స్-క్యూ క్యాంపస్‌ను తాను సందర్శించిన విషయాన్ని సీఎం గుర్తుచేసుకున్నారు. అప్పట్లో మిషన్ ఆగమన్ ప్రయోగానికి ముందు విక్రమ్-1 ఫ్లైట్ హార్డ్‌వేర్‌ను శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రానికి తరలించే కార్యక్రమాన్ని తానే స్వయంగా ప్రారంభించానని తెలిపారు. నేడు విక్రమ్-1 విజయవంతం కావడం తెలంగాణను ప్రపంచ స్థాయి ఏరోస్పేస్, స్పేస్ టెక్నాలజీ కేంద్రంగా తీర్చిదిద్దే దిశలో ఒక కీలక మైలురాయి అని ఆయన పేర్కొన్నారు.

**తెలంగాణకు పెరుగుతున్న పెట్టుబడులు**

ఈ చారిత్రాత్మక విజయం ద్వారా ఏరోస్పేస్ ఆవిష్కరణలు, అధునాతన తయారీ రంగం, మరియు తదుపరి తరం (నెక్స్ట్ జనరేషన్) అంతరిక్ష సాంకేతికతల అభివృద్ధికి తెలంగాణ ఒక అనువైన గమ్యస్థానంగా మరింత బలపడిందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. స్కైరూట్ వంటి సంస్థల విజయాలు రాష్ట్రంలో మరిన్ని పెట్టుబడులను ఆకర్షించడమే కాకుండా, యువతలో శాస్త్ర సాంకేతిక రంగాలపై ఆసక్తిని పెంపొందిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విజయం రాబోయే తరాల ఆవిష్కర్తలకు, యువ పారిశ్రామికవేత్తలకు ఎంతో స్ఫూర్తినిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

## ఉద్యోగాల 'నోటిఫికేషన్' కాదు.. 'లూటీఫికేషన్':

### 70 వేల ఉద్యోగాలు నిరూపిస్తే రాజీనామాకు సిద్ధం - సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సంచలన సవాల్!

హైదరాబాద్, బ్యూరో:

తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై భారాస (దీ=హా) వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో నిరుద్యోగులకు మేలు చేసే నోటిఫికేషన్ల పాలన సాగడం లేదని, దానికి బదులుగా ప్రజలను, రాష్ట్రాన్ని దోచుకునే లూటీఫికేషన్ నడుస్తోందంటూ ఆయన ఘాటు విమర్శలు చేశారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో భారాస విద్యార్థి, యువజన విభాగాల ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'యువ సంగ్రామ సదస్సు'కు కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సదస్సులో చేరిన వేలాది మంది నిరుద్యోగులు, విద్యార్థులను ఉద్దేశించి ఆయన ఉద్వేగభరిత ప్రసంగం చేశారు.



?అధికారంలోకి వచ్చిన నాటి నుండి తాము వేల సంఖ్యలో ఉద్యోగ నియామకాలు చేపట్టామని కాంగ్రెస్ ప్రభుత్వం చేసుకుంటున్న ప్రచారాన్ని కేటీఆర్ పూర్తిగా తిప్పికొట్టారు. కాంగ్రెస్ నాయకులు తాము అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది కాలంలోనే ఏకంగా 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని పచ్చి అబద్ధాలు ప్రచారం చేసుకుంటున్నారని మండిపడ్డారు. తాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ముక్కు సూటిగా ఒకటే సవాల్ విసురుతున్నానని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్తగా ఇచ్చిన 70 వేల ఉద్యోగాలు ఎక్కడో, ఎవరికి ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేసి నిరూపించాలని డిమాండ్ చేశారు. ఆ సంఖ్య నిజమని నిరూపిస్తే.. తాను ఇప్పుడే తన పదవికి రాజీనామా చేస్తానని, అంతేకాదు శాశ్వతంగా రాజకీయాల నుంచే తప్పుకుంటానని కేటీఆర్ సంచలన ప్రకటన చేశారు. గత భారాస ప్రభుత్వ హయాంలో పూర్తయిన రిక్రూట్‌మెంట్లు, తాము ఇచ్చిన నోటిఫికేషన్ల ప్రక్రియకు సంబంధించిన నియామక పత్రాలను కాంగ్రెస్ ప్రభుత్వం తమ ఖాతాలో వేసుకుని డబ్బా కొట్టుకుంటోందని ఆయన ఆరోపించారు.

?ఎన్నికల సమయంలో నిరుద్యోగులను ఓట్లు అడగడానికి కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన యూత్ డిక్లరేషన్ హామీలను కేటీఆర్ ఈ వేదికపై ఎండగట్టారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని చెప్పి నిరుద్యోగులను నమ్మించారని విమర్శించారు. ప్రతి ఏటా విడుదల చేస్తామన్న అధికారిక జాబ్ క్యాలెండర్ ఇప్పటివరకు ఎందుకు వెలుగు చూడలేదని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి కింద ఇస్తామన్న 4 వేల రూపాయల హామీ ఏమైందో ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. టాటా, బిర్లాల కంటే ఎక్కువగా నిరుద్యోగులకే కాంగ్రెస్ పార్టీ పెద్ద సున్నాలు చుట్టిందని, హామీలను తుంగలో తొక్కి యువత భవిష్యత్తుతో ఆడుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగులు తమ హక్కుల కోసం శాంతియుతంగా ధర్నాలు, ఆందోళనలు చేస్తుంటే ప్రభుత్వం అక్రమ అరెస్టులతో గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు బలగాలను అడ్డుపెట్టుకుని పాలన సాగించలేరని హెచ్చరించారు. యువత తరఫున, నిరుద్యోగుల తరఫున పోరాటంలో భారాస ఎన్నడూ వెనకడుగు వేయదని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు ఒక లెక్క, ఇకనుంచి మరో లెక్క అని హెచ్చరించిన ఆయన, రాబోయే రోజుల్లో నిరుద్యోగుల గొంతుకగా మారి కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై రోడ్లపైకి వచ్చి పోరాడుతామని, సెక్రటేరియట్‌ను ముట్టడించడానికైనా తాము సిద్ధమని ప్రకటించారు. ఈ యువ సంగ్రామ సదస్సులో భారాస ముఖ్య నాయకులు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా తరలివచ్చిన విద్యార్థి సంక్షేమ సంఘాల ప్రతినిధులు, వేలాది మంది నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.

## బీజేపీ అగ్రనేతల మధ్య ముగిసిన కీలక భేటీ:

### బండి సంజయ్, ఈటల రాజేందర్ మధ్య రాజీ కుదిర్చిన అభయ్ పాటిల్..

హైదరాబాద్, బ్యూరో:

తెలంగాణ భారతీయ జనతా పార్టీలో గత కొంతకాలంగా అంతర్గతంగా నడుస్తున్న రాజకీయ పరిణామాలకు తెరదించుతూ శనివారం ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ హైదరాబాద్‌లోని తన నివాసంలో ఏర్పాటు చేసిన పార్టీ అగ్రనేతల భేటీ విజయవంతంగా ముగిసింది. పార్టీ జాతీయ నాయకత్వం పంపిన ప్రత్యేక ప్రతినిధి అభయ్ పాటిల్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌లు ఈ సమావేశానికి హాజరయ్యారు. గత కొన్ని రోజులుగా ఈ ఇద్దరు కీలక నేతల మధ్య ఉన్న వ్యూహాత్మక భేదాలు, అంతర్గత అసంతృప్తులను తొలగించేందుకు అభయ్ పాటిల్ సుదీర్ఘంగా చర్చలు జరిపారు. ఇరు నేతలతో విడివిడిగా, ఆ తర్వాత కలిసి మాట్లాడి వారి మధ్య ఉన్న అపోహలను తొలగించి, విజయవంతంగా సయోధ్య కుదిర్చారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, రాష్ట్రంలో పార్టీ బలోపేతం కోసం ఇద్దరు నేతలు కలిసికట్టుగా ముందడుగు వేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు.



?ఈ కీలక సమావేశం ముగిసిన అనంతరం ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తీరుతో తెలంగాణ ప్రజలు కేవలం కొన్ని నెలల్లోనే పూర్తిగా విసిగిపోయారని మండిపడ్డారు. అధికారంలోకి వస్తే స్వర్గధామం చేస్తామని నమ్మబలికి, తీరా పీఠం ఎక్కిన తర్వాత ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క ప్రధాన హామీని కూడా కాంగ్రెస్ సర్కార్ నెరవేర్చలేకపోయిందని విమర్శించారు. రైతులు, మహిళలు, యువతను ఇలా అన్ని వర్గాలను కాంగ్రెస్ పార్టీ ఘోరంగా వంచించిందని ఆరోపించారు. రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం తీవ్రరూపం దాల్చిందని, అభివృద్ధి పనులకు సంబంధించిన నిధులు విడుదల కాకపోవడంతో కాంట్రాక్టర్లు బిల్లులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాల వల్ల చివం-కు కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి రాష్ట్రంలో దాపురించిందని లక్ష్మణ్ ఆందోళన వ్యక్తం చేశారు.

?రాష్ట్రంలో నెలకొన్న ఇటువంటి అరాచక, ప్రజా వ్యతిరేక పాలన వల్ల ప్రజలు ప్రత్యామ్నాయం వైపు చూస్తున్నారని, ప్రస్తుతం తెలంగాణలో భారతీయ జనతా పార్టీకి విపరీతమైన సానుకూల వాతావరణం ఏర్పడిందని లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, భారాస పార్టీల వైఫల్యాలను ప్రజలు గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో బీజేపీయే రాష్ట్రంలో ఏకైక శక్తిగా అవతరిస్తుందని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర సగటు అభివృద్ధిపై, ఇక్కడి ప్రజల సంక్షేమంపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రత్యేక చొరవ చూపుతున్నారని, కేంద్ర నిధులుపెద్ద ఎత్తున కేటాయిస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వాటిని సద్వినియోగం చేసుకోవడంలో విఫలమవుతోందని విమర్శించారు. పార్టీలో అంతర్గత విభేదాలు ఉన్నాయంటూ వస్తున్న వార్తలను ఆయన పూర్తిగా కొట్టిపారేశారు. ఈ భేటీతో తమ నాయకుల మధ్య ఉన్న చిన్నచిన్న పట్టింపులన్నీ తొలగిపోయాయని, పార్టీలో నేతల మధ్య ఎలాంటి విభేదాలు లేవని లక్ష్మణ్ స్పష్టం చేశారు. అధిష్టానం నిర్దేశించిన లక్ష్యాల మేరకు అందరం కలిసికట్టుగా ప్రజా సమస్యలపై క్షేత్రస్థాయిలో పోరాటాలు ఉధృతం చేస్తామని, తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడమే ఏకైక ధ్యేయంగా పనిచేస్తామని ఆయన వెల్లడించారు. ఈ సమావేశంలో పార్టీకి చెందిన ఇతర ముఖ్య నాయకులు కూడా పాల్గొన్నారు.

# జనాభా ఒక్కటే కొలమానమైతే.. పన్నులు కట్టే పౌరుడి హక్కుల గతి ఏంది?

## రాజ్యాంగ నిబంధన 81 అసలు ముచ్చట.. తెరవెనుక నడుస్తున్న అధికారం ఆట!

కేంద్ర అధికార పక్షం రాజ్యాంగాన్ని మార్చాలని చూస్తోంది. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు, దానితోటి వచ్చిన నియోజకవర్గాల పునర్విభజన బిల్లు అసలుకు చేసేది ఒక్కటే పని. మనం ఏ ఏండ్ల జనాభా లెక్కలను తీసుకోవాలనేది ఇవి మారుస్తున్నాయి. ఇప్పుడున్న లోక్‌సభ స్థానాలు 1971 జనాభా లెక్కల ప్రకారమే అట్లే ఉంచారు. ఈ బిల్లుల మీద ఒక్కో నిబంధన చొప్పున, రాష్ట్రాల వారీగా, పక్షాల వారీగా పంచాయితీ నడవబోతోంది. మూడింట రెండు వంతుల బలాన్ని చూపెట్టడానికి పక్షాలలో చీలికలు వస్తున్నాయి. ఏ జనాభా లెక్కలను వాడాలి, ఎవరి తలకాయలను లెక్క పెట్టాలని ప్రతి ఒక్కరూ కొట్లాడుకుంటున్నారు. ఓట్లు ఎటు పడ్డా గాని, అసలు ముచ్చటను తేల్చే ఆ ఒక్క వాక్యం గురించి మాత్రం ఎవ్వరూ మాట్లాడట్లేదు. దేశ రాజకీయాలలో రాబోయే ఈ పెద్ద లొల్లికి కారణం రాజ్యాంగంలో ఉన్న నిబంధన 81. మొత్తం స్థానాల సంఖ్యను పెంచి, దానంతట అదే నియోజకవర్గాల విభజన మొదలయ్యేటట్టు దీన్ని మార్చాలని కేంద్ర అధికార పక్షం అనుకుంటోంది. నిబంధన 81 లోని ఉపనిబంధన (2)(ఖ) ఏం చెప్తోందంటే: ప్రతి రాష్ట్రానికి ఇచ్చే స్థానాల సంఖ్యకు, ఆ రాష్ట్ర జనాభాకు ఉన్న నిష్పత్తి, సాధ్యమైనంత వరకు అన్ని రాష్ట్రాలకు ఒక్కటే తీరుగా ఉండాలి. అసలైన యంత్రం ఇదే. పక్షాలన్నీ కొట్లాడుకుంటున్న ఉపనిబంధన (3) అనేది ఉత్త ముచ్చట మాత్రమే --- అది జనాభా అనే పదం ఏ ఏండ్ల జనాభా లెక్కలకు వర్తిస్తుందో చెప్తుంది అంతే.

గడిచిన 75 ఏండ్లలో మనం నిజంగా దేన్ని మార్చామో ఒక్కసారి చూడండి. 42వ, 84వ, 87వ సవరణలు. ఇవన్నీ ఉత్తిగ ఉపనిబంధన (3) కిందికి పోయి జనాభా లెక్కల ఏండ్లను మాత్రమే మార్చాయి. ఉపనిబంధన (2)(ఖ) జోలికి ఎవ్వరూ పోలేదు. ఇప్పుడు సభ ముందున్న బిల్లు కూడా అదే పని చేస్తోంది. ఒక పదం అర్థం కోసమే మనం ఒక పెద్ద రాజ్యాంగ యుద్ధానికి తయారవుతున్నాం. ఇక్కడ తిరకాసు పదంతోటి లేదు, నిబంధనతోటి ఉన్నది. నిబంధన 81 ఉత్త జనాభా అని మాత్రమే చెప్పట్లేదు. ఆ జనాభా --- ఇంకేమీ వద్దు --- సభలో ఒక రాష్ట్రం గొంతుకను తేలుస్తుందని చెప్తోంది. అది అట్లే ఎందుకు ఉండాలి? అసలు సభ ఎందుకోసం ఉన్నదో కాడెల్లి ప్రారంభిద్దాం. దాని మొదటి అధికారం 'ధన నిధిపై అధికారం'. సభ ఒప్పుకోకుండా కేంద్ర ప్రభుత్వం ఒక్క పైసా కూడా వసూలు చేయలేదు, ఖర్చు పెట్టలేదు. ఆ పనిలో ఉన్న రెండు భాగాలను --- అంటే పైసలు ఎట్లా వస్తున్నాయి, ఎక్కడికి పోతున్నాయి అనే ముచ్చటను నిశితంగా చూడడమే సభ ముఖ్యమైన పని. దీనిలో మొదటి భాగానికి అంటే ఖర్చు పెట్టే దానికి జనాభా అనేది ఒక సరైన కొలమానమే. ఎక్కువ జనాభా ఉన్న రాష్ట్రానికి ఎక్కువ బడులు, ఎక్కువ బువ్వ గింజలు కావాల్సి వస్తాయి.

కానీ ఇది ఒక్క వైపు ముచ్చట మాత్రమే. లెక్కల పుస్తకంలో రెండో వైపు చూస్తే, ఆ నిధిని నిజంగా ఎవరు నింపుతున్నారు అనే ప్రశ్న వస్తుంది, అక్కడ జనాభా అనేది సరైన కొలమానం కాదు. 2022-23 మరియు 2025-26 నడుమ, మహారాష్ట్ర దేశం మొత్తం అమ్మకపు పన్నులలో సగటున 21.7 శాతం పైసలను ఇచ్చింది, కానీ దేశ జనాభాలో దాని వాటా కేవలం 9.1 శాతం మాత్రమే. కర్ణాటక 8.8 శాతం పన్ను ఇస్తూ, 4.8 శాతం జనాభాను కలిగి ఉన్నది. తమిళనాడు 8.8 శాతం పన్ను ఇస్తూ, 5.5 శాతం జనాభాను కలిగి ఉన్నది. ఇప్పుడు దీన్ని ఇంకో తీరుగా చూడండి. ఉత్తరప్రదేశ్ దేశంలో 17.1 శాతం జనాభాను కలిగి ఉండి, 6.7 శాతం పన్నును ఇస్తోంది. 11 మంది భారతీయులలో ఒక్కడుండే బిహార్, పన్నులలో 1.9 శాతం మాత్రమే ఇస్తోంది. అందుకే, కేంద్రం పైసలు ఎట్లా వసూలు అవుతున్నాయి, ఎట్లా ఖర్చు అవుతున్నాయి అని కనిపెట్టడానికే సభ ఉన్నది. దాని రూపం కేవలం ఖర్చు పెట్టే వైపునే చూపెడుతోంది. ఆదాయాన్ని ఇచ్చే వైపును --- అంటే దాని సొంత బాధ్యతలో సగం భాగాన్ని --- సున్నా లెక్క చూస్తున్నారు. లెక్కల పుస్తకంలో ఒక వైపు ఉన్నదానికి సర్వస్వం దొరుకుతుంటే, ఇంకో వైపు ఉన్నదానికి ఏమీ దక్కకపోవడం ఎందుకు?

ఒకవేళ అట్లా కాకుండా ఉంటే ఎట్లుంటుందో ఊహించుకోండి. నిబంధన 81(2)(ఖ) స్థానాల కేటాయింపును కేవలం ఒక్క ముచ్చట మీద కాకుండా, సమాన ప్రాధాన్యత ఉన్న రెండు అంశాల మీద ఇచ్చి ఉంటే: రాష్ట్ర జనాభా వాటా, జాతీయ పన్నుల నిధికి ఆ రాష్ట్రం ఇచ్చే వాటా. నేను 2026 నాటి జనాభా అంచనాను, గత నాలుగేండ్ల అమ్మకపు పన్నుల సగటును సగం-సగం నిష్పత్తిలో తీసుకొని లెక్కలు వేశాను. దాని ప్రకారం లోక్‌సభ స్థానాల చిత్రం ఇట్లా మారుతుంది. మహారాష్ట్ర ఇప్పుడున్న 48 స్థానాల నుండి 84 స్థానాలకు పెరుగుతుంది, ఉత్తరప్రదేశ్ 80 స్థానాల నుండి 65 స్థానాలకు తగ్గుతుంది. గుజరాత్ 26 నుండి 39 స్థానాలకు పెరిగితే, కర్ణాటక 28 నుండి 37 స్థానాలకు పెరుగుతుంది. పశ్చిమ బెంగాల్ 32 స్థానాలు, తెలంగాణ 19 స్థానాలు అట్లే ఉంటాయి. కేరళ, ఆంధ్రప్రదేశ్ తమ స్థానాలను కోల్పోతాయి, తమిళనాడుకు మాత్రం ఇప్పుడున్న 39 స్థానాలే అట్లే ఉంటాయి. గతంలో జరిగిన నియోజకవర్గాల పునర్విభజన రాజ్యాంగ సవరణల తీరుగానే, ఇప్పుడు తెస్తున్న సవరణ కూడా నిబంధన 81 లోని ఉపనిబంధన (3) ని మాత్రమే కదుపుతోంది, ఇది ఏ జనాభా లెక్కలను వాడాలో చెప్తుంది అంతే. కానీ రాష్ట్ర జనాభాకు, దాని ప్రాతినిధ్యానికి నడుమ ఉన్న బంధాన్ని తేల్చే ఉపనిబంధన (2)(ఖ) జోలికి ఎవ్వరూ పోవట్లేదు.

ఈ నూతన ప్రతిపాదిత లెక్కల ప్రకారం తెలంగాణ రాష్ట్ర పరిస్థితిని ప్రత్యేకంగా పరిశీలిస్తే, ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాల సంఖ్యలో ఎలాంటి మార్పు ఉండదు. జనాభాను మరియు పన్నుల వాటాను సమానంగా తీసుకొని లెక్కలు కట్టినప్పుడు, తెలంగాణ తన ఉనికిని నష్టపోకుండా ఇప్పుడున్న 19 స్థానాలను స్థిరంగా కాపాడుకోగలుగుతుంది. ఈ లెక్కల కెల్లి మనకు తెలిసే ముచ్చట ఏందంటే, ఇది కేవలం దక్షిణాది రాష్ట్రాల కథ మాత్రమే కాదు. దీనిలో అందరికంటే ఎక్కువ లాభపడేది మహారాష్ట్ర, అందులోనూ ఎక్కువ భాగం ముంబై ఇచ్చే పన్నుల వల్లే వస్తోంది. ఇది విలువ పుట్టే చోటు కంటే, కంపెనీల పెద్ద కార్యాలయాలు ఉన్న చోటు కావడం వల్ల వచ్చే తేడా కావచ్చు. గుజరాత్, హర్యానా కూడా స్థానాలను గెలుచుకుంటాయి, కేరళ, ఆంధ్రప్రదేశ్ నష్టపోతాయి. ఏ నిజాయితీ ఉన్న సూత్రం అయినా వీటన్నింటినీ లెక్కలకి తీసుకోవాలి: మీరు ఏ పన్నును కొలుస్తున్నారు, పెద్ద కార్యాలయాల ప్రభావాన్ని ఎట్లా సరిచేస్తున్నారు, ఈ గంపలో ఇంకా ఏమేమి ఉండాలి --- మానవ వికాసం, పర్యావరణం, అవసరాలు లాంటివి. మనం చేయాల్సిన అసలైన వాదన ఇదే.

ఇది ధనిక రాష్ట్రాలు ఓట్లను కొనుక్కోవడానికి ఇచ్చే ప్రతిపాదన కాదు. ఇది పౌరుడి ఓటు హక్కును వారి పన్ను రశీదుతో ముడిపెట్టదు. ప్రతి ఒక్క మనిషి ఓటు పూర్తిగా సమానమే. నియోజకవర్గాల పునర్విభజన అనేది ఒక్కరి ఓటు ముచ్చట ఎన్నడూ కాదు. ఇది ఉమ్మడి సమాఖ్యలలో ఒక రాష్ట్రం యొక్క మొత్తం బలం గురించి, ఏ సమాఖ్య కూడా కేవలం తలకాయల లెక్కల మీద మాత్రమే నడవలేదు. రాజ్యసభ దీనికి సమతుల్యతను తేవడానికి పెట్టారు, కానీ మనం అక్కడ కూడా స్థానాలను జనాభా లెక్కల ప్రకారమే ఇచ్చేసాము --- అందుకే అది అసమతుల్యతను ఆపడానికి బదులు ఇంకా పెంచుతోంది. దీన్ని ఎట్లా చేయాలో మనకు ముందే ఎరుకే. ఆర్థిక సంఘం కేంద్ర పన్నులను కేవలం ఒక్కటే ప్రాతిపదికన పంచదు. అది జనాభా, వైశాల్యం, ఆదాయ దూరం, అడవుల విస్తీర్ణం, జనాభా పనితీరు, పన్ను ప్రయత్నం లాంటి ఎన్నో అంశాలను లెక్కలకి తీసుకుంటుంది. పైసలను పంచుకోవడానికి ఇన్ని ముచ్చటల కలయిక సరైనదైనప్పుడు, అధికారాన్ని అంటే స్థానాలను పంచుకోవడానికి మాత్రం కేవలం ఒక్క మొరటు సంఖ్య అంటే జనాభా మాత్రమే ఎట్లా సరైనదవుతుంది? ఎందుకు?

ఆ ప్రాతిపదికను మార్చండి, అప్పుడు మిగిలిన మార్పులన్నీ చూడండి. నియోజకవర్గాల పునర్విభజనలో స్థానాలను కాపాడుకోవడానికి ఏ ముఖ్యమంత్రీ ఇండ్లలో ఎక్కువ మంది పిల్లలను కనమని అడగాల్సిన అవసరం ఉండదు, లేదా పిల్లల కోసం ప్రోత్సాహక పథకాలను ఆలోచించాల్సిన అవసరం లేదు. రాష్ట్రాల మధ్య వలసలు అనేది ఒక ముప్పుగా లేదా ద్వేషంగా మారడం ఆగిపోతుంది --- ఎందుకంటే ఏ కూలీ ఎక్కడికి వలస పోయినా, అతను ఆ రాష్ట్రానికే పన్నులు కడతాడు. ఇప్పుడున్న లెక్కలలో ఒక వింతైన నిజం దాగి ఉన్నది: మహారాష్ట్ర, కర్ణాటక కడుతున్న పన్ను ఆదాయంలో ఎక్కువ భాగం, ఇప్పుడు జనాభా పరంగా స్థానాలను గెలుచుకోవడానికి సిద్ధంగా ఉన్న రాష్ట్రాల నుండి వచ్చిన వలస కూలీల వల్లే వస్తోంది, కానీ వాళ్ళు ఇప్పటికీ తాము వదిలిపెట్టిన సొంత ఊర్ల జనాభాలోనే లెక్కించబడుతున్నారు. 50 ఏండ్ల కెల్లి మనం ఏ జనాభా లెక్కలను వాడాలనే దాని మీదే కొట్లాడుకుంటున్నాం. మనం సభ సమయాన్ని, ఒక రాజ్యాంగ సవరణను కేవలం ఉపనిబంధన (3) లోని ఒకే ఒక్క పదం అర్థం కోసం, ఎన్నో పక్షాల పంచాయితీలతోటి వృథా చేయబోతున్నాం. దీనికి బదులు ఉపనిబంధన (2)(ఖ) ని మార్చండి. మన పొరపాటు అక్కడే ఉన్నది. మనం ఏ ఏండ్ల జనాభాను లెక్కిస్తున్నామనే దానిలో కాదు, గడిచిన 75 ఏండ్లలో ఎవ్వరూ అడగడానికి కూడా ఆలోచించని ఆ నాలుగు పదాలలో ఉన్నది: జనాభా, మరేమీ కాదు.




వెంక గారి భూమయ్య సీనియర్ జర్నలిస్ట్ విశ్లేషణ
9848559863


## నిర్మల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'క్లీన్ అండ్ గ్రీన్'

నిర్మల్, జూలై 18 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర (బాటనీ) విభాగం ఆధ్వర్యంలో శనివారం కళాశాల ప్రాంగణంలో 'క్లీన్ అండ్ గ్రీన్' పరిశుభ్రత కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. సుధాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో వృక్షశాస్త్ర సహాయ ఆచార్యులు డాక్టర్ పవన్ కుమార్ సమన్వయకర్తగా వ్యవహరించి పరిసరాల పరిశుభ్రత, మొక్కల సంరక్షణపై అవగాహన కల్పించారు.


కళాశాల ఆవరణలోని పిచ్చి మొక్కలను తొలగించి, మొక్కలకు నీరు పోసే కార్యక్రమంలో ఎన్సీసీ, ఎన్నెస్సెస్ వాలంటీర్లు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ యు. గంగాధర్, ఏఓ నాగ శ్రీనివాస్, సీనియర్ అధ్యాపకులు డాక్టర్ సూర్య సాగర్ పాల్గొన్నారు.



## ఆర్మూర్ ఏడో వార్డులో ఎనిమిదేళ్ల డ్రైనేజీ సమస్యకు మున్సిపల్ సిబ్బంది పరిష్కారం

ఆర్మూర్, జూలై 18 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని ఏడవ వార్డు మోడల్ స్కూల్ వెనుక భాగంలో గత 7, 8 సంవత్సరాలుగా పేరుకుపోయిన మురుగునీటి డ్రైనేజీ సమస్యకు మున్సిపల్ అధికారులు శనివారం శాశ్వత పరిష్కార పనులను ప్రారంభించారు. మహాలక్ష్మి కాలనీ, మామిడిపల్లి గ్రామాల నుండి పెద్ద ఎత్తున వచ్చే మురికినీరు ఇక్కడ నిలిచిపోవడం వల్ల స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఈ దీర్ఘకాలిక సమస్యను గుర్తించిన మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్ స్థానిక కాలనీ వాసుల పూర్తి సహకారంతో శనివారం డ్రైనేజీ పూడికతీత పనులను మొదలు పెట్టారు. మురుగునీరు నిల్వ ఉండకుండా కాలువలను శుభ్రపరుస్తున్నట్లు సిబ్బంది తెలిపారు.



## నారాయణ హైస్కూల్ లో జీవశాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణా తరగతుల తనిఖీ

.నిర్మల్, జూలై 18 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ పట్టణంలోని నారాయణ హైస్కూల్ లో గత మూడు రోజుల నుండి జీవశాస్త్ర ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఇంటిగ్రేటెడ్ టీచర్స్ ట్రైనింగ్ శిక్షణా కేంద్రాన్ని జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న శనివారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా బొమ్మల ఆధారిత వినూత్న పద్ధతిలో డీఆర్పీ పి. గంగా సురేష్ ఉపాధ్యాయులకు ఆహారపు గొలుసు క్రమంపై యాక్టివిటీ ద్వారా అవగాహన కల్పించారు.



అభ్యసన ఫలితాల సాధన కోసం ఇలాంటి బొమ్మల ఆధారిత బోధనా పద్ధతులను ఉపాధ్యాయులు తమ పాఠశాలల తరగతి గదులలో తప్పనిసరిగా చేయాలని డీఈఓ సూచించారు. జీవశాస్త్ర బోధనలో ఉత్తమ నైపుణ్యాలు ప్రదర్శిస్తున్న డీఆర్పీల కృషిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

## సోషల్ మీడియా ప్రభావం: పాత నల్లూరు పురాతన ఆలయాల పునరుద్ధరణకు దాతల చొరవ

ముప్కాల్, జూలై 18 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలంలోని పాత నల్లూరు గ్రామంలో గల చారిత్రాత్మక పురాతన శివాలయం, హనుమాన్ ఆలయాలలో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇటీవల ఈ ఆలయాల శిథిలావస్థ దుస్థితిని వివరిస్తూ సాను వంజరి, ఎం.ఆర్. సాయికుమార్ అధికారికంగా రూపొందించిన వీడియోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ కావడంతో భక్తులు, దాతలు పెద్ద ఎత్తున స్పందించారు.



భక్తులు స్వచ్ఛందంగా తరలివచ్చి ఆలయ పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించి, ప్రాంగణాన్ని శుభ్రపరిచి పూజలు చేశారు. కాగా, ఈ రెండు పురాతన ఆలయాలకు పూర్తి స్థాయిలో రంగులు వేయించేందుకు నిర్మల్‌కు చెందిన ఒక ప్రముఖ దాత ఆర్థిక సహాయం చేయడానికి ముందుకు రావడం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

## తానూరులో సాహిత్యరత్న డాక్టర్ అన్నాభావూ సాఠే వర్ధంతి వేడుకలు

తానూర్, జూలై 18 (తెలంగాణ వెన్నెల వాక్కు): విప్లవ రచయిత, సాహిత్యరత్న డాక్టర్ అన్నాభావూ సాఠే వర్ధంతి కార్యక్రమాన్ని జూలై 18వ తేదీన తానూరు మండల కేంద్రంలో అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు అన్నాభావూ సాఠే ఉత్సవ కమిటీ సభ్యుడు గాయకవాడ్ సాయినాథ్ (ఝరి) తెలిపారు. మహాత్మా జ్యోతిరావ్ పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలతో శ్రామిక, బహుజన ప్రజల హక్కుల కోసం తన కలంతో పోరాడిన మహనీయుడు అన్నాభావూ సాఠే అని ఆయన కొనియాడారు.

అణగారిన వర్గాల చైతన్యం కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. శనివారం నిర్వహించే ఈ వర్ధంతి కార్యక్రమానికి తాలూకా పరిధిలోని మాదిగ సమాజం, బహుజన బంధువులు, దళితులు, ప్రజా సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై మహనీయుడికి ఘన నివాళులు అర్పించాలని పిలుపునిచ్చారు.

## బాసర నాగభూషణం హైస్కూల్లో ఘనంగా వనమహోత్సవం

బాసర, జూలై 18 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ జిల్లా బాసర మండల కేంద్రంలోని నాగభూషణం హైస్కూల్ ఆవరణలో శనివారం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటే హరితహారాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వనమహోత్సవంలో ముఖ్య అతిథిగామొక్కలు నాటిన బాసర ఎస్‌హెచ్‌ఓ మాట్లాడుతూ చెట్లే ప్రగతికి మెట్లు అని, ప్రతి ప్రాణికి జీవనాధారమైన



ప్రాణవాయువును అందించేది మొక్కలేనని విద్యార్థులకు వివరించారు.

మొక్కలు నాటడం వల్ల పర్యావరణానికి అందమే కాకుండా వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలను పెంచాలన్నారు. కార్యక్రమంలో నాగభూషణం హైస్కూల్ ప్రిన్సిపాల్ జె. బాబు రావు, ఉపాధ్యాయులు కిషన్, నవీన్ మరియు బాసర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## బాసర గోదావరి నదిలో గుర్తుతెలియని 50 ఏళ్ల మగ వ్యక్తి శవం లభ్యం

.బాసర, జూలై 18 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ జిల్లా బాసర గోదావరి నది పరివాహక ప్రాంతంలో శనివారం ఒక గుర్తు తెలియని మగ మనిషి శవం నీటిపై తేలుతూ కనిపించింది. సమాచారం అందుకున్న బాసర మండల కేంద్ర పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, స్థానిక గజ ఈతగాళ్లు మరియు గ్రామ పంచాయతీ కార్మికుల సహాయంతో మృతదేహాన్ని నది నుండి బయటకు తీశారు.



పోలీసుల ప్రాథమిక అంచనా ప్రకారం సదరు మగ వ్యక్తి వయసు సుమారు 50 సంవత్సరాలు ఉంటుందని, చామన ఛాయా రంగు కలిగి, మెరూన్ రంగు డ్రాయర్ ధరించి ఉన్నాడని తెలిపారు. ఈ వ్యక్తికి సంబంధించిన వివరాలు ఎవరికైనా తెలిసినా లేదా గుర్తుపట్టినా బాసర పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ అధికారిక సెల్ నెంబర్ 8712659540 లో సంప్రదించాలని కోరారు.

## సాంకేతిక శిక్షణ పొందిన అభ్యర్థుల డ్రాయింగ్, టైలరింగ్ పరీక్షల మెమోలు సిద్ధం

నిర్మల్, జూలై 18 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఈ సంవత్సరము జనవరి నెలలో నిర్వహించబడిన ప్రభుత్వ అధికారిక డ్రాయింగ్, టైలరింగ్ సాంకేతిక పరీక్షలకు సంబంధించిన ఫలితాలు ఇటీవల విడుదలయ్యాయని, అందులో ఉత్తీర్ణులైన అభ్యర్థుల ఒరిజినల్ మెమోలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారి దర్శనం భోజన్న తెలిపారు.

టైలరింగ్ లోయర్, హయ్యర్ మరియు డ్రాయింగ్ లోయర్, హయ్యర్ విభాగాలలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు తమ ఒరిజినల్ హాల్ టికెట్ తో పాటు ఒక పాస్‌పోర్ట్ సైజు ఫొటోను తీసుకుని, ఈనెల జూలై 20వ తేదీ నుండి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించి తమ మెమోలను నేరుగా పొందవచ్చని డీఈఓ వివరించారు.

తెలంగాణ వెన్నెల వాక్కు
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU
TGTEL/25/A0871



# బెడ్లు తక్కువ.. పేషెంట్లు ఎక్కువ..

## దినదినాన దుర్భరస్థితికి ముధోల్ ప్రభుత్వ ఆసుపత్రి!

- ఒకే బెడ్డుపై ముగ్గురు పిల్లలను కూర్చోబెట్టి చికిత్స..
- నిల్వ నీడ లేక రోగుల వ్యయ ప్రయాసాలు
- బేస్మెంట్ దశకే పరిమితమైన నూతన భవన నిర్మాణం..
- త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్

ముధోల్, జూలై 18 (తెలంగాణ వెన్నెల వాక్కు): ముధోల్ నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి పరిస్థితి దినదినాన అత్యంత దుర్భరస్థితికి చేరుతోంది. ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య విపరీతంగా పెరుగుతున్నా, అందుకు తగ్గట్టుగా వైద్య సదుపాయాల కల్పన మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా మారింది. గత ప్రభుత్వ హయాంలో ఈ సామాజిక ఆరోగ్య కేంద్రానికి మెరుగైన వసతులు కల్పించాలని నూతన భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసినప్పటికీ, ఆ పనులు కేవలం బేస్మెంట్ దశకే పరిమితమై నిలిచిపోయాయి. ప్రస్తుతం ఆసుపత్రిలో కేవలం 20 బెడ్లు మాత్రమే అందుబాటులో ఉండటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



**ఒకే బెడ్డుపై ముగ్గురు పిల్లలు:**

మారుతున్న వాతావరణ పరిస్థితుల వల్ల చిన్న పిల్లల్లో జ్వరాలు, వాంతులు, విరోచనాల కేసులు విపరీతంగా పెరిగాయి. ఆసుపత్రిలో బెడ్ల కొరత తీవ్రంగా ఉండటంతో, ఒకే బెడ్డుపై ముగ్గురు పిల్లలను కూర్చోబెట్టి వైద్య సిబ్బంది గ్లూకోజ్ బాటిళ్లు ఎక్కించి వైద్యం అందిస్తున్న దారుణ దృశ్యం ఇక్కడి దుస్థితికి అద్దం పడుతోంది. దీనికి తోడు కొందరు సిబ్బంది రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోతన్న యాదవ్ మాట్లాడుతూ, నిరుపేదలకు వైద్య ఇబ్బందులు, ఆర్థిక భారం తప్పేలా లేదని, ప్రభుత్వం స్పందించి నూతన భవన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు.

## తానూర్ కేజీబీవీలో రూ. 98 లక్షల అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే రామారావు పటేల్



తానూర్, జూలై 18 (తెలంగాణ వెన్నెల వాక్కు): తానూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నాబార్డు నిధులతో నిర్మించిన అదనపు తరగతి గదులు, మౌలిక సదుపాయాల భవనాలను ముధోల్ శాసనసభ్యుడు పవార్ రామారావు పటేల్ శనివారం అధికారికంగా ప్రారంభించారు. నాబార్డు నిధుల ద్వారా రూ. 56 లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు తరగతి గదులను, రూ. 42.12 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆధునిక మౌలిక వసతులను ఆయన విద్యార్థినులకు అంకితం చేసి దుస్తులను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థినులకు నాణ్యమైన విద్యా సౌకర్యాలు అందించేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మెరుగైన విద్యా వాతావరణం కల్పనలో ఈ పనులు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో భైంసా ఏఎంసీ అధ్యక్షుడు షిండే ఆనందరావు పాటిల్, బీజేపీ మండల అధ్యక్షుడు పుండ్రు లక్ష్మణ్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎల్ నినో వర్షాభావ పరిస్థితులపై ఈ నెల 20న మంత్రి జూపల్లి కృష్ణారావు ఉన్నత స్థాయి సమీక్ష

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నాలుగు జిల్లాల కలెక్టర్లతో ఉట్నూరులో కీలక సమావేశం
- ముందస్తు వ్యవసాయ ప్రణాళికలు, తాగునీరు, అత్యవసర కార్యాచరణపై విస్తృత చర్చ

నిర్మల్/ఉట్నూరు, జూలై 18 (తెలంగాణ వెన్నెల వాక్కు): రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో ఏర్పడుతున్న తీవ్ర వర్షాభావ పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలను ముమ్మరం చేసింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్-ఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ నెల 20న ఉట్నూరు కేంద్రంగా ఒక ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి ఆదిలాబాద్ పరిధిలోని ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లతో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొననున్నారు.

**అన్ని శాఖల సమన్వయంతో అత్యవసర కార్యాచరణ:**

ఈ నెల 20న ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 2:00 గంటల వరకు జరిగే ఈ సమీక్షలో వర్షాభావ పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికల అమలుపై మంత్రి దిశా నిర్దేశం చేయనున్నారు. ముఖ్యంగా వ్యవసాయ, ఉద్యానవన, సాగునీటి శాఖ, మిషన్ భగీరథ తాగునీటి సరఫరా, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖ, వైద్య ఆరోగ్య శాఖల అధికారులు ఈ సమావేశానికి హాజరై, ఎల్ నినో పరిస్థితులను తట్టుకునేందుకు తమ తమ శాఖల క్షేత్రస్థాయి సన్నద్ధతపై పూర్తి వివరాల నివేదికను మంత్రికి సమర్పించనున్నారు.

## కానిస్టేబుళ్లు, హోంగార్డుల సమస్యల పరిష్కారానికి ఎస్పీ జానకి షర్మిల పోలీసు దర్బార్



నిర్మల్/ జూలై 18 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ జిల్లా పోలీసు ఆర్మ్డ్ రిజర్వ్ (ఏఆర్) హెడ్‌క్వార్టర్స్ లో శనివారం వారాంతపు పరేడ్ అనంతరం జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల ఆధ్వర్యంలో కానిస్టేబుళ్లు, హోంగార్డుల సమస్యల నివారణ కొరకు ప్రత్యేక దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ సిబ్బందితో ముఖాముఖి సమావేశమై వారి విధి నిర్వహణ సమస్యలను, వ్యక్తిగత ఇబ్బందులను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేశారు.

అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ప్రతి పోలీసు ఉద్యోగి శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలని, బెట్టింగులు, మద్యం, మాదకద్రవ్యాల వంటి వ్యసనాలకు బానిసలు కాకూడదన్నారు. ఎలాంటి ఒత్తిళ్లు ఎదురైనా ఆత్మహత్యల వంటి తీవ్ర నిర్ణయాలు తీసుకోకుండా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. ముఖ్యంగా మహిళా సిబ్బంది సమస్యల పరిష్కారానికి పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



## నర్సాపూర్, భైంసా బడులు, గడ్డెన్నవాగు ప్రాజెక్టును తనిఖీ చేసిన కలెక్టర్ భవేశ్ మిశ్రా



నర్సాపూర్, జూలై 18 (తెలంగాణ వెన్నెల వాక్కు): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టికాహార భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన నర్సాపూర్, భైంసా మండలాల్లో విస్తృతంగా పర్యటించి, నర్సాపూర్ జిల్లా పరిషత్ హిస్కూల్ లో విద్యార్థుల హాజరు రికార్డులను, విద్యా బోధనను ఆకస్మికంగా తనిఖీ చేసి ప్రాంగణంలో మొక్కలు నాటారు.

అనంతరం నర్సాపూర్ మండల కేంద్రంలో కొత్తగా నిర్మించిన సామూహిక మరుగుదొడ్ల సముదాయాన్ని పరిశీలించారు. ఆ తర్వాత భైంసా మండలంలోని గడ్డెన్న వాగు ప్రాజెక్టును సందర్శించి, ప్రస్తుతం నిల్వ ఉన్న నీటి మట్టం వివరాలను అడిగి తెలుసుకుని తాగునీటి సరఫరా భవిష్యత్ ప్రణాళికపై సమీక్షించారు. తనిఖీల్లో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డీఈఓ భోజన్న పాల్గొన్నారు.

## 33 మంది లబ్ధిదారులకు రూ. 11.80 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ:



నిర్మల్, జూలై 18 (తెలంగాణ వెన్నెల వాక్కు): ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) పథకం నిరుపేద కుటుంబాలకు ఒక ఆపద్బాంధవుడిలా వరంలా నిలుస్తోందని కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కూచాడి శ్రీహరి రావు అన్నారు. శనివారం నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆయన నివాస ప్రాంగణంలో నిర్మల్ నియోజకవర్గానికి చెందిన 33 మంది బాధిత లబ్ధిదారులకు మొత్తం 11 లక్షల 80 వేల రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అధికారికంగా పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ ఆస్పత్రులలో ఖరీదైన వైద్య చికిత్సలు చేయించుకోలేక ఇబ్బందులు పడుతున్న పేదలకు వైద్య ఖర్చుల భారం తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సకాలంలో ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ హాది పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగంగా పూర్తి చేయాలి:

నిర్మల్, జూలై 18 (తెలంగాణ వెన్నెల వాక్కు) వివిధ దశల్లో పెండింగ్ లో నిలిచిపోయిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను లబ్ధిదారులతో సమన్వయం చేసుకుని వేగవంతంగా పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇండ్లు, భూగర్భ జలాల సంరక్షణ చర్యలపై హౌసింగ్, లేబర్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎంపీడీఓలు ప్రతిరోజు పంచాయతీ కార్యదర్శులతో ఇండ్ల నిర్మాణ పురోగతిపై సమీక్ష జరపాలన్నారు. అలాగే భూగర్భ జలాల పెంపులో భాగంగా వర్షపు నీటిని సంరక్షించే రైన్ వాటర్ రిచార్జింగ్ నిర్మాణాలపై ప్రజల్లో విస్తృత అవహన కల్పించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ ఓటర్ల ఎస్ఐఆర్ ప్రక్రియ పరిశీలన



నిర్మల్, జూలై 18 (తెలంగాణ వెన్నెల వాక్కు): నిర్మల్ జిల్లా కేంద్రంలో సాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కూచాడి శ్రీహరి రావు శనివారం క్షుణ్ణంగా పరిశీలించారు. పట్టణ పరిధిలోని గాజులపేట్, బుదవార్పేట్, బంగల్పేట్, సోన్ మండలంలోని గంజాల్, కూచన్ పల్లి లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి బూత్ లెవెల్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చూడడం అధికారుల బాధ్యత అన్నారు. నిబంధనల ప్రకారం ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని బీఎల్ఓలను కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి పాల్గొన్నారు.

## అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి: మాజీ మంత్రి అల్లోల



నిర్మల్, జూలై 18 (తెలంగాణ వెన్నెల వాక్కు): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా నిర్మల్ పట్టణంలోని మదీనా కాలనీ, ఆశ్రా కాలనీ ప్రాంతాల్లో కొనసాగుతున్న ఓటరు నమోదు ప్రక్రియను మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ కేంద్రాల వద్ద బీఎల్ఓలతో మాట్లాడి కొత్త ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పుల దరఖాస్తుల సేకరణ తీరును అడిగి తెలుసుకున్నారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ నిరక్షరాస్యులు, వృద్ధులు, దివ్యాంగులైన ఓటర్లకు బీఎల్ఓలు పూర్తి సాంకేతిక సహకారం అందించి, వారి దరఖాస్తు ఫారాలను ఎలాంటి తప్పులు లేకుండా నింపేలా చూడాలన్నారు. అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా జాబితాలో చేరకుండా మిగిలిపోకూడదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రఫీ, ధర్మాజీ రాజేందర్, పీవీ రమణ రెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ వెన్నెల వాక్కు
TGTEL/25/A0871
జాతీయ దినపత్రిక
TELANGANAVENNELA WAKKU



# క్రిమినల్ కేసుల సత్వర పరిష్కారమే లక్ష్యం: జిల్లా జడ్జి ఎస్. శ్రీవాణి, ఎస్పీ జానకి షర్మిల

- అండర్ ట్రయల్ ఖైదీల కేసుల విచారణ వేగవంతంపై కో-ఆర్డినేషన్ కమిటీ సమీక్ష
- పోలీసు, న్యాయస్థానాల పరస్పర సమన్వయంతోనే బాధితులకు సత్వర న్యాయం

నిర్మల్, జూలై 18 (తెలంగాణ వెన్నెల వాక్కు):
తెలంగాణ హైకోర్టు మార్గదర్శకాల మేరకు క్రిమినల్ కేసుల సత్వర పరిష్కారం, ముఖ్యంగా అండర్ ట్రయల్ ఖైదీలకు సంబంధించిన కేసుల విచారణను వేగవంతం చేయడం లక్ష్యంగా జిల్లా కో-ఆర్డినేషన్ కమిటీ ఉన్నత స్థాయి సమావేశం శనివారం నిర్మల్ జిల్లా ప్రధాన జిల్లా, సెషన్స్ కోర్టు ఆవరణలో నిర్వహించబడింది. జిల్లా, సెషన్స్ జడ్జి ఎస్. శ్రీవాణి, జిల్లా ఎస్పీ డాక్టర్ జి. జానకి షర్మిల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పెండింగ్ క్రిమినల్ కేసుల పురోగతి, చార్జ్‌షీట్లను సకాలంలో దాఖలు చేయడం, సాక్షుల హాజరును నిర్ధారించడం, కోర్టు సమన్లు, వారెంట్లను వెంటనే అమలు చేయడం వంటి అంశాలపై సమగ్రంగా సమీక్షించారు.



**శాస్త్రీయ ఆధారాలతో కేసులను బలోపేతం చేయాలి:**
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ, ప్రజలకు సత్వర న్యాయం అందించడంలో పోలీసు శాఖ, ప్రాసిక్యూషన్, న్యాయస్థానాల మధ్య సమర్థవంతమైన సమన్వయం అత్యంత కీలకమని అన్నారు. ప్రతి దర్యాప్తు అధికారి చట్టపరమైన ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని, నేరస్థులకు శిక్షలు పడేలా శాస్త్రీయ ఆధారాలతో కేసులను బలోపేతం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా జడ్జి ఎస్. శ్రీవాణి మాట్లాడుతూ, అండర్ ట్రయల్ ఖైదీలకు సంబంధించిన కేసులను వేగవంతంగా పరిష్కరించేందుకు అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి రాధిక, ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి రవీందర్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, జిల్లా జైలర్ సూర్యప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు.


# ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి చొరవతో స్వదేశానికి దుబాయ్ గల్ఫ్ మృతుడి మృతదేహం

- విదేశాంగ మంత్రిత్వ శాఖ, ఎన్నారై సెల్ అధికారులతో మాట్లాడి వేగంగా నివేదికలు పూర్తి
- శంషాబాద్ ఎయిర్ పోర్ట్ లో కన్నీరుమున్నీరైన సారంగాపూర్ నివాసి ఒడ్డే నర్సింలు కుటుంబ సభ్యులు

సారంగాపూర్, జూలై 18 (తెలంగాణ వెన్నెల వాక్కు):
బ్రతుకుదెరువు కోసం, ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్ళి అక్కడ అకాల మరణం చెందిన సారంగాపూర్ మండల కేంద్రానికి చెందిన ఒడ్డే నర్సింలు మృతదేహం ఎట్టకేలకు శనివారం స్వగ్రామానికి చేరుకుంది. గత నెల 28వ తేదీన అనారోగ్య కారణాలతో నర్సింలు దుబాయ్‌లో మృతి చెందడంతో, తీవ్ర ఆందోళనలో ఉన్న కుటుంబ సభ్యులు, మండల బీజేపీ నాయకులు ఈ విషయాన్ని స్థానిక ముథోల్ శాసనసభ్యుడు ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. హుటాహుటిన స్పందించిన ఎమ్మెల్యే విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికారులతో, ఎన్నారై సెల్ ఉన్నతాధికారులతో నిరంతరం మాట్లాడి వీలైనంత త్వరగా మృతదేహాన్ని స్వదేశానికి పంపేలా పటిష్ట చర్యలు చేపట్టారు.



స్పందించిన దుబాయ్ అధికారులు మృతికి గల కారణాలపై అధికారిక నివేదికలను వేగంగా పూర్తి చేసి మృతదేహాన్ని విమానంలో స్వదేశానికి పంపించారు. హైదరాబాద్ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో సదరు కుటుంబ సభ్యులకు అధికారులు లాంఛనంగా మృతదేహాన్ని అప్పగించారు. అత్యవసర సమయంలో స్పందించి మృతదేహాన్ని రప్పించడంలో కీలక పాత్ర పోషించిన ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డికి మృతుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.


GOVERNMENT OF TELANGANA
GENERAL ADMINISTRATION (NRI) DEPARTMENT
Memo No. GAD-NRID/2/101/2026-2, Dated:16-07-2026.

# వర్షాభావ పరిస్థితులపై స్పష్టమైన ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలి

నిర్మల్, జూలై 18 (తెలంగాణ వెన్నెల వాక్కు):
రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు జిల్లా అధికారులు ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) సంజయ్ జాజు ఆదేశించారు. శనివారం సాయంత్రం హైదరాబాద్ నుండి వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్ లో ఆయన మాట్లాడారు. ఎల్ నినో ప్రభావంతో తక్కువ వర్షపాతం నమోదవుతున్నందున, రైతులు తక్కువ నీటితో పండే పంటలు సాగు చేసేలా పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు.



వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, సోమవారం ఉట్నూరులో జిల్లా ఇన్-ఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రత్యేక అధికారి ఇలంబర్తిలతో నిర్వహించబోయే సమీక్షకు అధికారులు తగిన నివేదికలతో హాజరుకావాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, హార్టికల్చర్ అధికారి రమణ, డీఎంహెచ్ఓ రాజేందర్ పాల్గొన్నారు.

# జవలా (బి) పాఠశాలలో మొక్కలు నాటిన తానూర్ ఎస్సై

తానూర్, జూలై 18 (తెలంగాణ వెన్నెల వాక్కు):
పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కల పెంపకం ద్వారానే భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించగలమని తానూర్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఎస్సై శేఖ్ జుబేర్ అన్నారు. శనివారం తానూర్ మండలంలోని జవలా (బి) గ్రామ ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన



హరిత కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగామొక్కలు నాటారు.
ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి వాటిని చెట్లుగా ఎదిగే వరకు సంరక్షించాలని ఎస్సై కోరారు. ఈ హరిత కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ శివకాంత శేషారావు, పాఠశాల ఉపాధ్యాయులు శివాజీ, మహేందర్, మాధవ్, నయుం, జ్యోతిబా మరియవిద్యార్థులు పాల్గొన్నారు.

# శాకాహార జీవితమే మనిషికి, ప్రకృతికి మేలు చేస్తుంది

ఆర్మూర్, జూలై 18 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ప్రకృతిని కాపాడితేనే ప్రకృతి మనల్ని కాపాడుతుందని, మనిషి తన ఆర్థిక వేట, ఆడంబరాల కోసం ప్రకృతి సంపదను



మనిషి శరీర నిర్మాణం మాంసాహారానికి సంబంధించినది కాదని, బెత్తెడు నాలుక రుచి కోసం ఆరడుగుల దేహాన్ని పాడుచేసు

నాశనం చేయడం దారుణమని శాకాహార ప్రచారకులు అభిలాష్ తుమ్మ అన్నారు. శనివారం ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ, అడవులను నరికేసి, కొండలను తవ్వేసి ప్రకృతి అసమ తుల్యతను దెబ్బతీస్తూ వర్షాలు పడటం లేదని ఆవేదన చెందడం మానవుడి కనువిప్పుకు నిదర్శనమన్నారు. కుంటున్నారన్నారు. మాంసంలో ఉండే పోషకాల కన్నా ఎక్కువ పప్పు ధాన్యాలు, పండ్లు, కూరగాయలలో ఉన్నాయని నిరూపితమైందన్నారు. జిహ్వా చాపల్యం కోసం, బలుల పేరుతో ఏ జీవిని హింసించే హక్కు మనిషికి లేదని, హింస కాదు కరుణయే మార్గమని ఆయన పిలుపునిచ్చారు.

# అష్ట గ్రామంలో ఆరడుగుల ఎత్తున ప్రమాదకర విద్యుత్ పనుల పరిష్కారం

ముధోల్, జూలై 18 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండలంలోని అష్ట గ్రామంలో రోడ్ల పక్కన ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు, విద్యుత్ కనెక్షన్ల సమస్యలపై ఇటీవల సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్ వినతి పత్రం అందజేశారు. దీనిపై సాకూలంగా స్పందించిన విద్యుత్ ఏఈ శ్రీకాంత్ ఆదేశాల మేరకు శనివారం విద్యుత్ సిబ్బంది గ్రామంలో



యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులను చేపట్టారు.
తక్కువ ఎత్తులో ఉన్న ట్రాన్స్ఫార్మర్లను పరిశీలించి వాటి చుట్టూ రక్షణ కంచెలు ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టారు. గ్రామసభ తీర్మానం ప్రకారం విద్యుత్ సమస్యలను వేగంగా పరిష్కరించిన ఏఈ శ్రీకాంత్, లైన్ ఇన్స్పెక్టర్ బాసిత్, శ్రీమన్నారాయణ, మనీష్ లకు సర్పంచ్ లావణ్య శ్రీనివాస్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# ముధోల్ కేజీబీవీని సందర్శించి భోజన నాణ్యతను పరిశీలించిన డీపీఓ లక్ష్మణ్

ముధోల్, జూలై 18 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థినులకు మెనూ పాటిస్తూ పరిశుభ్రమైన, పోషక విలువలు కలిగిన నాణ్యమైన భోజనం అందించాలని డివిజనల్ పంచాయతీ అధికారి బట్టేకర్ లక్ష్మణ్ అధికారులకు సూచించారు. శనివారం ఆయన ముధోల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి, పాఠశాల నిర్వహణ మరియు విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన వసతులను క్షుణ్ణంగా పరిశీలించారు.
వంటశాల పరిశుభ్రత, ఆహార పదార్థాల నిల్వ విధానం, భోజనం వడ్డిస్తున్న తీరును పరిశీలించిన ఆయన, నాణ్యతా ప్రమాణాలు



పాటిస్తుండటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థినులతో మమేకమై విద్యాభ్యాసం, వసతులపై ఆరా తీశారు. ఈ తనిఖీ పర్యటనలో కేజీబీవీ ప్రత్యేక అధికారి ఫర్హాత్ బేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# అష్ట గ్రామంలో ఎల్ నినో ప్రభావంపై రైతు అవగాహన సదస్సు

.ముధోల్, జూలై 18 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండల పరిధిలోని అష్ట గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్ అధ్యక్షతన శనివారం రైతులకు ఎల్ నినో వాతావరణ మార్పులపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎల్ నినో ప్రభావంతో వర్షాలు ఆలస్యంగా కురిసే అవకాశం ఉందని, రైతులు పరిస్థితులకు అనుగుణంగా తక్కువ నీటితో పండే పంటల ఎంపిక చేసుకోవాలని సూచించారు.
వర్షాకాలంలో రిసే ప్రతి చుక్క నీటిని నిల్వ చేసుకునేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా పొలాల్లో పంట కుంటలు నిర్మించుకోవాలన్నారు. వరికి బదులుగా జొన్న, సజ్జ, రాగులు వంటి చిరుధాన్యాలతో పాటు పెసర, మినుము, కంది వంటి ఆరుతడి పప్పుధాన్యాల సాగు ప్రస్తుత పరిస్థితుల్లో అనుకూలమని వివరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సావిత్ర, సెక్రటరీ సాహెబ్ రావు పాల్గొన్నారు.



# ముధోల్ పోస్ట్ ఆఫీస్ ను సందర్శించిన శిశు మందిర్ విద్యార్థులు

ముధోల్, జూలై 18 (తెలంగాణ వెన్నెల వాక్కు):
ముధోల్ మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలకు చెందిన నాల్గో తరగతి విద్యార్థులు శనివారం తమ విజ్ఞానశాస్త్ర బోధన క్షేత్ర పర్యటనలో భాగంగా ముధోల్ ప్రధాన



పోస్ట్ ఆఫీస్ ను సందర్శించారు. ఈ సందర్భంగా పోస్ట్ మాస్టర్ గంగయ్య విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలికి, పోస్ట్ ఆఫీస్ అంతర్గత విధులు, ప్రజలకు అందిస్తున్న వివిధ రకాల సేవలను వివరించారు.ఉత్తరాల రవాణా, స్టాంపుల ప్రాధాన్యతపై విద్యార్థులకు కలిగిన పలు ఆసక్తికర సందేహాలను పోస్ట్ మాస్టర్ నివృత్తి చేశారు. ఈ వినూత్న క్షేత్ర సందర్శనలో విద్యార్థుల వెంట పాఠశాల ఉపాధ్యాయ ఆచార్యులు రమ్య, ప్రసన్న, గౌతమి, కైలాస్ పాల్గొన్నారు.

# ఝరి (బి) గ్రామంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

తానూర్, జూలై 18 (తెలంగాణ వెన్నెల వాక్కు):
తానూర్ మండలంలోని ఝరి (బి) గ్రామానికి చెందిన అర్హులైన లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ఆర్థిక సహాయ చెక్కులను ముధోల్ మాజీ శాసనసభ్యుడు గడ్డిగారి విఠల్ రెడ్డి శనివారం అధికారికంగా పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన జోందలే సాగర్‌బాయి కుటుంబానికి 60 వేల రూపాయల విలువైన చెక్కును, అలాగే సాదియా బేగం, షేక్ రజాక్ లకు సుమారు 15 వేల రూపాయల వైద్య సహాయ చెక్కులను అందజేశారు.
ఈ సందర్భంగా లబ్ధిదారులు సకాలంలో ఆర్థిక సహాయం అందించి ఆదుకున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉమ్మడి జిల్లా ఇన్-ఛార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ భైంసా మేకల దేవదాస్, గైక్వాడ్ సాయినాథ్ పాల్గొన్నారు.



OWNED AND EDITED BY VENKAGARI BHUMIAIAH, H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILWALPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, PUBLISHED BY YOGESH KUMAR D, H. NO. 3-167, DILAWARPUR VILLAGE & MANDAL, NIRMAL, TELANGANA-504306, PRINTER MOHAMMAD ABDUL RAHEMAN PRINTED AT MMI PRINTING PRESS 1-227/A, HIGHWAY ROAD, KONDAPALLE REBBANA, KONARAM BHEEM, ASIFABAD, MANCHERIAL, TELANGANA-504292, PUBLISHED AT H. NO. 1-2, NEW LOLAM VILLAGE, DILAWARPUR MANDAL, NIRMAL, TELANGANA-504306, EDITOR: BDT VENKAGARI BHUMIAIAH, PRGI REGISTRATION NUMBER TG-TEL/25/A0871, CELL: 9848568953, MAIL ID: telanganavennelawakku@gmail.com